క్లుప్తంగా

తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యురాలిగా హేనా



బాధ్యతలు స్వీకరించిన వైద్యురాలు హేనా

తూర్పుగంగవరం (తాళ్లూరు): స్థానిక పీహెచ్‌సీ రెండో వైద్యురాలిగా జి.హేనా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ మృదుల రాజీనామా చేయడంతో పోస్టు ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీని భర్తీ చేస్తూ జిల్లా వైద్యాధికారి.. హేనాను నియమించారు. ఆమె బాధ్యతలు స్వీకరించి మర్యాదపూర్వకంగా పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రత్నాన్ని కలిశారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పాటు పలు బాధ్యతలు ఆమెకు అప్పగించినట్లు వైద్యాధికారి రత్నం తెలిపారు.

నగర పంచాయతీ స్వీపర్‌కు నివాళి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్, సిబ్బంది

పొదిలి రూరల్: నగర పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తున్న దార్ల ఆదెయ్య సోమవారం మృతి చెందాడు. మంగళవారం ఆదెయ్య మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన మల్లవరం తరలించారు. మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, సిబ్బంది నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ. 15 వేలు అందజేశారు.

14 నుంచి కబడ్డీ పోటీలు

కొనకనమిట్ల: సంక్రాంతి పురస్కరించుకొని గొట్లగట్టు గ్రామంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. రూ.30, రూ.25, రూ.20, రూ.15, రూ.10, రూ. 5 వరుస బహుమతులతో పాటు పాటు మెమెంటోలు అందజేస్తామన్నారు. క్రీడాకారులు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దూర ప్రాంత క్రీడాకారులకు భోజన వసతి ఉంటుందన్నారు. వివరాలకు 8096476870, 9912312365 నంబర్లను సంప్రదించాలన్నారు.

ముగ్గుల పోటీలు రేపు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నరవ రోడ్డులో గల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 12వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు యర్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే కోలాట ప్రదర్శన, అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు.

ఉత్సాహంగా రంగోలి పోటీలు

యర్రగొండపాలెం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రంగోలి పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో అందమైన ముగ్గులు వేశారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్యాల శ్రీనివాసాచార్యులు, అధ్యాపకులు పి.ప్రదీప్, కె.వి.ఎస్.శ్రీనివాస్, పి.రామకోటయ్య, పి.ఝాన్సి, డి,తిరుపతయ్య, డి.సుజాత, ఆర్.విజయనాయక్, వి.వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

డెంగీ కేసు నమోదుతో అధికారుల అప్రమత్తం

ముండ్లమూరు (దర్శి టౌన్): మారెళ్లలో ఓ చిన్నారికి డెంగీ సోకిందన్న సమాచారంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. సర్పంచి గోపనబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి లార్వా సర్వే చేశారు. ప్రజలను అప్రమత్తం చేశారు. పాత టైర్లు, నీటి నిల్వ, డిస్పోజల్ బాటిల్స్, గ్లాస్‌లు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, టైర్లు లేకుండా చూసుకోవాలని చెప్పారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ వెంకటరావు, హెచ్‌వీ షేక్ హుస్సేన్, హెచ్‌ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య సేవలు

తర్లుపాడు: మండలంలోని సీతనాగులవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిస్సీ వైద్య మంగళవారం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిశుభ్రత పాటించి రోగాలకు దూరంగా ఉండాలన్నారు. అనారోగ్య అనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు. విటమిన్, ఐరన్, మల్టీ విటమిన్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది డాక్టర్ శ్రావణక్, సుల్తానా, పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాస్, విజయలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ పావని, తదితరులు పాల్గొన్నారు.



వరి ధాన్యం తూర్పార పడుతున్న రైతులు



అలసందల తూర్పారలో అన్నదాతలు

ధాన్య జీవులు..

కొనకనమిట్ల: ప్రకృతి అనుకూలించింది.. రైతులంతా చేయీ చేయీ కలిపారు.. మూడు నాలుగు నెలలపాటు చెమట చిందించారు. ఎడ్ల బండ్లతో వేకువనే పొలాలకు వెళ్లి రాత్రిళ్లు పంటకు కాపలా ఉన్నారు. పురుగు పుట్రా నాశనం చేసేందుకు మందు చల్లారు. పందులను, కోతులను తరిమి కొట్టారు. మంచి జరగాలని దేవుడిని వేడుకున్నారు. చివరికి వారి ప్రార్థనలు ఫలించాయి. ప్రకృతి అనుకూలించింది. అందుకే చేలన్నీ కంకులతో నిండాయి. పొలాలన్నీ ధాన్యంతో కళకళలాడాయి. ప్రస్తుతం కొనకనమిట్ల మండలంలో రైతులంతా అలసంద, మినుము, వరి కళ్లాల్లో సందడి చేస్తున్నారు. ధాన్యాన్ని తూర్పారబట్టి గింజలను ఇళ్లకు తరలిస్తున్నారు. పంటకు గిట్టుబాటు ధర రావాలని.. అప్పులన్నీ తీరాలని, తొలిపండగ సంక్రాంతి ఉత్సాహంతో జరుపుకోవాలని మనసారా కోరుకుందాం.



ఎడ్ల బండితో పొలం వెళుతున్న రైతులు

సంక్షేమ పాలనే జగనన్న ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్, వేదికపై నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్



సమావేశంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు

- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్
- వైపాలెంలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం
- పార్టీ పరిశీలకుడు, నెల్లూరు మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ హాజరు

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, నియోజకవర్గ పరిశీలకుడు పి.రూప్‌కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి మండల పార్టీ కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమ పథకాలు ఆగని విషయాన్ని గుర్తు చేశారు. గత మూడేళ్లగా సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని, లబ్ధిదారుల అకౌంట్లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టం లేని పచ్చనేతలు ఆర్థిక సంక్షోభం పేరుతో విమర్శలు గుప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు అందిస్తున్న పథకాలు నచ్చలేదని, నిలిపి వేయాలని మాత్రం అనడంలేదని, ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పుడు సిగ్గులేకుండా పథకాలను కొనసాగిస్తామని, ఇంకా మెరుగుపరుస్తామని అంటున్నారని తూర్పారబట్టారు. వచ్చే ఎన్నికలే తనకు చివరివని, లాస్ట్ ఛాన్స్ పేరుతో ఒకాయన, ఒక్క ఛాన్స్ ఇవ్వండంటూ మరో నేత అడుగుతున్నారని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి వ్యంగ్యంగా అన్నారు. వైఎస్సార్ సీపీకి 175 సీట్లు కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్న వలంటీర్లపై పచ్చ మీడియా, పచ్చ నేతలు దుర్మార్గపు ప్రచారానికి ఒడిగట్టారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గడప గడపకూ తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేయాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, యర్రగొండపాలెం నియోజకవర్గ పరిశీలకుడు పి.రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఏదో ఒక విధంగా అధికారం చేజిక్కించుకోవాలని ప్రతిపక్షాలు దుర్మార్గపు ఆలోచన చేస్తున్నాయని విమర్శించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వైఎస్సార్ సీపీకి చెవులు, కళ్లు లాంటివారని, 2019కి ముందు ఏ విధంగా పనిచేశామో అలాగే 15 నెలలు కష్టపడి పనిచేయాలని, అప్పుడే రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నట్లు సంక్షేమ ప్రభుత్వాన్ని మరో పర్యాయం ఏర్పాటు చేసుకోగలుగుతామన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇష్టంతో, ప్రేమతో పనిచేసినప్పుడే జగనన్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, వివిధ విభాగాల నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, బి.బాల చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



మేళాను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, మేనేజర్, ఎంపీడీఓ

తాళ్లూరు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఉపయోగించుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కోరారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం మేళా నిర్వహించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మేళాను ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి సాగు ఉత్పత్తులు ప్రోత్సహిస్తే ఆరోగ్యకర ఉత్పత్తులు అందుబాటులోకి తేవచ్చని జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు (ఏపీసీఎన్ఎఫ్) మేనేజర్ డి.సుభాషిణి మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, తాళ్లూరు మండలంలో రైతులను ప్రోత్సహించేందుకు ప్రకృతి వ్యవసాయ మేళా నిర్వహించిన వ్యవసాయాధికారి ప్రసాదరావును అభినందించారు. సర్పంచి మేకల చార్లేస్ సర్జన్, ఎంపీడీఓ కీర్తి, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, పీహెచ్‌సీ వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ, పశువైద్యాధికారి అశోక్‌రెడ్డి, ఏవో ప్రసాదరావు, ఎస్‌డీపీ వెంకట రమణ, సిబ్బంది నరసింహులు, శివనాగిరెడ్డి, కె.నాగిరెడ్డి, యోగేశ్వరమ్మ, అనిత, ఎసీఆర్‌పీఎస్ మురళి, వేణు, వెంకటేశ్వరరావు, కోటిరెడ్డి, ఏఈఓ నాగరాజు, వీఏఏలు పాల్గొన్నారు.

పులి దాడిలో చనిపోయిన పశువులకు నష్టపరిహారం



నష్టపరిహారం చెక్‌లు అందజేస్తున్న రేంజర్ సుబ్బారావు

యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలో పులి దాడి చేసిన సంఘటనలో చనిపోయిన పశువులకు మంగళవారం అటవీ శాఖాధికారులు నష్టపరిహారం అందించారు. పాలుట్ల గిరిజన గూడెంకు చెందిన ఆవులు మేత కోసం అడవిలోకి వెళ్లాయి. అక్కడ మేత మేస్తున్న ఆవులపై పులి దాడి చేసింది. ఈ సంఘటనపై డివిజనల్ అటవీ శాఖాధికారి విఘ్నేష్ అపావ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి పశువుల యజమానులకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు దేశావత్ నాగమణిబాయికు రూ.30వేలు, వెంకటేశ్వర్లు నాయక్‌కు రూ.20 వేలను గంజివారిపల్లె అటవీ క్షేత్రాధికారి ఎస్‌వీ సుబ్బారావు అందచేశారు. కార్యక్రమంలో పాలుట్ల సెక్షన్ అధికారి ఆర్.సీతారామాచారి, బీట్ అధికారి జె.కృష్ణచైతన్య పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు పెంచితే కఠిన చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

కొమరోలు: గంజాయి మొక్కలను పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని కొమరోలు ఎస్ఐ ఎ.సుబ్బరాజు హెచ్చరించారు. మండలంలోని చింతలపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల టేకులపెంట గ్రామాన్ని మంగళవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, స్థానిక ఎస్ఐ సుబ్బరాజు సందర్శించారు. గ్రామస్తులకు సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎస్ఐ సుబ్బరాజు మాట్లాడారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే వారిపై చర్యలకు ఉపక్రమిస్తామని, ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా సమాచారం అందించాలని తెలిపారు. ఎస్ఈబీ సీఐ అరుణకుమారి పాల్గొన్నారు.

దొంగ ఓట్లు తొలగించాలి



మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

దర్శి: గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏదో విధంగా గెలవాలనే ఉద్దేశంతో దొంగ ఓట్లు చేర్పించారని, ఆ ఓట్లు వెంటనే తొలగించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. 10వ తరగతి, ఇంటర్ అర్హత ఉన్న వారు కూడా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావడం చిత్రంగా ఉందన్నారు. ఎలాటి అర్హతలు లేని వారిని ఉపాధ్యాయులుగా చేర్చారని చెప్పారు. ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ గుర్తింపు కార్డుగా డిగ్రీ సర్టిఫికెట్, ఉపాధ్యాయ గుర్తింపు కార్డుగా డీఈఓ జారీ చేసిన సర్వీసు గుర్తింపు కార్డు చూపించే విధంగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. దొంగ ఓటర్లను తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి, రాజశేఖర్, మీనిగ శ్రీను, రామకోటిరెడ్డి, ఈర్ల రవికుమార్, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

18న ఆలయాల భూముల వేలం

పొదిలి రూరల్: స్థానిక నిర్మమహేశ్వర స్వామి దేవస్థానం, పొదిలి కొండ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలకు సంబంధించిన భూముల కౌలును బహిరంగ వేలం ద్వారా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 3 గంటలకు పొదిలి నిర్మమహేశ్వ స్వామి దేవస్థానంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొబ్బరి చిప్పలు ప్రోగు, లడ్డూ ప్రసాదాలు అమ్ముకొనేందుకు ఈ నెల 18న వేలం జరుగుతుందన్నారు. పొదిలి కొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో 2023 ఫిబ్రవరి 1 నుంచి 2024 జనవరి 31 వరకు తలనీలాలు ప్రోగు చేసుకోవడం, కొబ్బరికాయల అమ్మకం, కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకోవడం, లడ్డూ ప్రసాదాల అమ్మకం కోసం ఈ నెల 18న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

బాధ్యతగా పనిచేసే వారిని ఎంపిక చేయండి



తర్లుపాడు: ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, పరిశీలకులు హబీబుల్లాను సత్కరిస్తున్న దృశ్యం



మార్కాపురంలో.. ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

తర్లుపాడు: వైఎస్సార్ సీపీపై ఇష్టంతో బాధ్యతగా పనిచేసే వారిని గృహ సారథులుగా ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో తర్లుపాడు మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ సారథులుగా ఎంపిక చేసే వారు 50 గృహాల పరిధిలో ఉండాలన్నారు. స్మార్టు ఫోన్‌ను కలిగి ఉండాలని తెలిపారు. 50 గృహాల పరిధిలో ఒక మహిళ, ఒక పురుషుడిని ఎంపిక చేయాలన్నారు. పార్టీ మార్కాపురం నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాను నాయకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్, ఎంపీటీసీ, సచివాలయ కన్వీనర్‌లు కలిసి గృహ సారథులను ఎంపిక చేయాలన్నారు. ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, సచివాలయం కన్వీనర్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి పనిచేయాలి

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి గృహ సారథులుగా ఎంపికైన వారు పనిచేసే విధంగా గుర్తించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కాపురం పట్టణ, మండల నాయకులతో గృహ సారథుల ఎంపికకై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వలంటీర్‌లతో పాటు గృహసారథులు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. గృహ సారథులు వారికి కేటాయించిన 50 గృహాల పరిధిలో నివాసం ఉన్న వారిని గుర్తించాలని చెప్పారు. సారథులకు తప్పని సరిగా స్మార్టు ఫోన్‌ను కలిగిన ఉండాలన్నారు. యాభై గృహాల పరిధిలో సారథులు ఒక పురుషుడు, ఒక మహిళ ఉండేలా ఎంపిక చేయాలన్నారు. మార్కాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు హబీబుల్లా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ పి.కేశవరావు, ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ షెక్షావలి, మండల అధ్యక్షులు బొగ్గురవి చెన్నారెడ్డి, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, నగేష్, సిరాజ్, దొడ్డా భాగ్యలక్ష్మి, షెక్షావలి, రంగలక్ష్మమ్మ, జీ.వనజాక్షి, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసులు, హర్షిత బాబి, ఉత్తమ్, రంగయ్య, తాడిపత్రి చెన్నారెడ్డి, జి. సూర్యనారాయణరెడ్డి, రోజ్‌లిడియా, పలువురు కౌన్సిలర్లు, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, సచివాలయం కన్వీనర్‌లు పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు

పొదిలి: ఆర్టీసీ బస్టాండ్, నగర పంచాయతీ కార్యాలయం, సివిల్ సప్లయిస్ గోడౌన్‌ల వద్ద మంగళవారం సీఐటీయూ జెండాలను, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ ఆవిష్కరించారు. అఖిల భారత 17వ మహాసభలు ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరుగుతున్నట్లు రమేష్ చెప్పారు. కార్మిక వర్గాల ఐక్యంగా పోరాటాలు చేయటం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నాయకులు ఎం.వెంకటరావు, జి.నాగులు, డి.సుబ్బయ్య, కె.శేషయ్య, కె.ప్రసాద్, వెంకటయ్య, నరసయ్య పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక సివిల్ సప్లయీస్ గోడౌన్ వద్ద సీఐటీయూ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన సంఘ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ సీఐటీయూ 17వ మహాసభలు జనవరి 18 నుంచి 23 వరకు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా జెండాను ఆవిష్కరించామన్నారు. సివిల్ సప్లయి గోడౌన్ సీఐటీయూ అధ్యక్షుడు మురికిపూడి ఆదాం, కర్నా కృష్ణ, కర్నా హనుమయ్య, వెంకటేశ్వర్లు, కటికల రాజయ్య, రామయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉడుముల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉడుముల మాట్లాడుతూ ప్రభుత్వం చేట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను క్యాలెండర్‌లో చక్కగా వివరించారని సోషల్ మీడియా సభ్యులను అభినందించారు. ఇదే ఉత్సాహంతో 2024లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే నినాదంతో సోషల్ మీడియా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం చరవేగంగా చేపడుతున్నారన్నారు. ఎమ్మెల్యేకు మద్దతుగా గ్రామాల్లో ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారంటే ఆయన పనితీరుకు నిదర్శనమని ఉడుముల అన్నారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తాతిరెడ్డి చినవెంకటరెడ్డి, వార్డు సభ్యులు ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, సీసీకేఆర్ శ్రీను, సోషల్ మీడియా సభ్యులు బ్రహ్మారెడ్డి తదిరులు పాల్గొన్నారు.

ఎంపీజే నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

మార్కాపురం: ఎంపీజే 2023 నూతన క్యాలెండర్‌ను డీఎస్పీ డాక్టర్ కిషోర్‌కుమార్ తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆశయాలు, లక్ష్యాలు చాలా ఉన్నతంగా ఉన్నాయని, రాజ్యాంగ పరిరక్షణ, హక్కుల కోసం వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ఎంపీజే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఒక వారధిలా పనిచేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాశిం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ రసూల్, నాయకులు మహబూబ్ బాషా, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువైన చలి తీవ్రత



ముండ్లమూరులో చలిమంటతో సేద తీరుతున్న రైతులు

దర్శి టౌన్: శీతాకాలంలో ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి చేరుతుండటంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. నియోజకవర్గంలో మంగళవారం వేకువజాము నుంచి చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాధారణ పనులు చేసుకునే రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామాలు, పొలాల వద్ద రైతులు చలి మంటలు వేసుకుని వేడిని ఆస్వాదిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, శ్వాస కోస వ్యాధిగ్రస్తులు, వాకర్స్ చలి తీవ్రతకు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు వీధుల్లో వేడి వేడి కాఫీ,టీతో సేద తీరారు. ఉదయం 7.30 గంటల వరకు ఎండ కోసం ఎదురు చూశారు.